భారతీయ జనతా పార్టీ - తెలంగాణ
**BHARATIYA JANATA PARTY**
**Telangana**

Dr. Shyamaprasad Mukherjee Bhavan
Opp: Exhibition Grounds
Nampally, Hyderabad-500 001.

31-10-2018

## పత్రికా ప్రకటన

ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 143వ జయంతి వేడుకలను భారతీయ జనతా పార్టీ తెలంగాణ శాఖ ఘనంగా నిర్వహించింది. హైదరాబాద్ నాంపల్లి అసెంబ్లీ దగ్గర ఉన్న సర్దార్ పటేల్ విగ్రహానికి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ సహా పార్టీ నాయకులు బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీ పి.మురళీధర్ రావు, పార్లమెంట్ సభ్యులు, మాజీ కేంద్ర మంత్రి శ్రీ బండారు దత్తాత్రేయ, శ్రీ జి.కిషన్ రెడ్డి, బిజెపి శాసనమండలి నాయకులు, హైదరాబాద్ నగర అధ్యక్షులు శ్రీ ఎన్.రాంచందర్ రావు, శ్రీ బద్దం బాల్ రెడ్డి, శ్రీ చింతల రామచంద్రారెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా డా॥ లక్ష్మణ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానంతరం దేశవ్యాప్తంగా ఉన్న 565 సంస్థానాలకు చెందిన నవాబులను, రాజులను పిలిపించి ఆయా సంస్థానాలను దేశంలో విలీనం చేశారని సర్దార్ పటేల్‌ను కొనియాడారు. అయితే హైదరాబాద్, జునాగఢ్, జమ్ము కాశ్మీర్ సంస్థానాలు విలీనాన్ని వ్యతిరేకిస్తూ స్వతంత్రంగా ఉంటామని మొండికేశాయన్నారు. దేశమంతా స్వాతంత్రం వచ్చి సంబరాలు జరుపుకుంటూ ఉంటే హైదరాబాద్ సంస్థానం ప్రస్తుత తెలంగాణ ప్రాంతం స్వాతంత్రానికి దూరంగా ఉందన్నారు. నిజాం దురాగతాలను ఎదుర్కోవడానికి నాడు ఎంతోమంది బలిదానం అయ్యారని, ఎంతోమంది వీరవనితలు నిజాం ప్రైవేట్ సైన్యం రజాకార్లతో పోరాడి ఈ ప్రాంత విమోచనకు కృషి చేశారని తెలిపారు. చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, షోయబుల్లా ఖాన్, కొమరం భీమ్ బలి దానం.. సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవతో తెలంగాణ ప్రాంతం నిజాం నుంచి విమోచన పొందిందన్నారు. ఆపరేషన్ పోలోలో భాగంగా భారత సేన ఈ ప్రాంతానికి వచ్చి నిజాం మెడలు వంచిందని, 17 సెప్టెంబర్ 1948న హైదరాబాద్ భారతదేశంలో విలీనమైందని వివరించారు.

గత ప్రభుత్వాలతో పాటు టీఆర్ఎస్ ప్రభుత్వం రజాకార్ల వారసత్వంతో పుట్టిన ఎంఐఎం పార్టీ అడుగులకు మడుగులొత్తి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం లేదని విమర్శించారు. తెలంగాణ ప్రజల పోరాటాలను, త్యాగాలను ఈ ప్రభుత్వాలు అవమాన పరుస్తున్నాయని దుయ్యబట్టారు. పటేల్ లేకుండా తెలంగాణ ఉండేది కాదని, నేడు టీఆర్ఎస్ పార్టీ ఉండేది కాదని అన్నారు. ముఖ్యమంత్రి నాటి పోరాట యోధులను, సర్దార్ పటేల్‌ను గౌరవించి విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతానికి స్వాతంత్రాన్ని సిద్ధించడానికి కారణమైన వారిని మరిచి ఈ ప్రభుత్వం సర్దార్ పటేల్ స్ఫూర్తిని నీరుగారుస్తుందన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని బిజెపితో పాటు తెలంగాణ ప్రజలు కోరుతుంటే కాంగ్రెస్, టిఆర్ఎస్, టిడిపిలు ఎంఐఎం ఒత్తిడికి లొంగి అధికారికంగా నిర్వహించడం లేదన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడమే సర్దార్ పటేల్‌కు అసలై నివాళి అన్నారు. బిజెపి తెలంగాణలో అధికారంలోకి వస్తేనే తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరుపుతామని స్పష్టం చేశారు. మజ్లిస్ ఎజెండాను అమలుచేసే టీఆర్ఎస్, టీడీపీ, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ప్రపంచం పటేల్ ఖ్యాతిని గుర్తించేలా ఈ రోజు 182 మీటర్ల ఎత్తయిన సర్దార్ విగ్రహాన్ని ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారు గుజరాత్‌లో నర్మదా నది ఒడ్డున ఆవిష్కరించారని, దీనికి దేశ ప్రజలందరూ గర్వపడుతున్నారని అన్నారు. సర్దార్ పటేల్‌ను తెలంగాణ పాలకులు విస్మరించడం క్షమార్హం కాదని అన్నారు.

నెహ్రూ కుటుంబాన్ని తప్ప దేశంలో ఉన్న నాయకులందరినీ కాంగ్రెస్ విస్మరించిందని, మాజీ ప్రధాని శ్రీ పీవీ నరసింహారావు అవమానించిందని, రాజ్యాంగ నిర్మాత డా॥ బీఆర్ అంబేద్కర్‌ను ఎన్నికల్లో ఓడించిందన్నారు. కాంగ్రెస్ విస్మరించిన స్వాతంత్ర సమరయోధులను బిజెపి వెలుగులోకి తీసుకొచ్చి గౌరవిస్తుందన్నారు. పోరాటయోధులను గౌరవించే సంస్కృతి సాంప్రదాయం బిజెపిదని, ఈ సంస్కృతిని నేర్చుకోవాల్సిన అవసరం కాంగ్రెస్‌కు ఉందని డా॥ లక్ష్మణ్ హితువు పలికారు.

**కార్యాలయ కార్యదర్శి**